## బాక్స్‌టైప్ కల్వర్టు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, ఇంజనీరింగ్ అధికారులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చేపట్టిన బాక్స్‌టైప్ కల్వర్టు పనులను ఎమ్మెల్యే గాంధీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం రాత్రి పరిశీలించారు. సర్కిల్– 20 ఈఈ దుర్గా ప్రసాద్, డీఈ ఆనంద్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే రాకపోకలు స్తంభించిపోతున్నాయని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, సందీప్ రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జైలు నుంచి హెచ్‌సీయూ విద్యార్థి విడుదల


నవీన్‌తో సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి, ఎస్‌ఎఫ్‌ఐ సీనియర్ నాయకుడు ఎర్రం నవీన్ సంగారెడ్డి(కంది) జిల్లా జైలు నుంచి శనివారం ఉదయం విడుదలయ్యారు. విద్యార్థులతో కలిసి క్యాంపస్‌కు చేరుకున్నారు. మార్చి 30వ తేదీన నవీన్‌ను క్యాంపస్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అదేరోజు సంగారెడ్డి జైలుకు పంపారు. 13 రోజుల అనంతరం బెయిల్ రావడంతో అధికారులు విడుదల చేశారు. నవీన్‌ను కలిసిన వారిలో సీపీఎం జోన్ కమిటీ సభ్యుడు కొంగర కృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శివ, దుర్గారావు, బషీర్, అజయ్ ఉన్నారు.

## అలకాపూర్ అభివృద్ధికి కృషి

టౌన్‌షిప్ అధ్యక్షుడు వంశీ


సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్‌లో సమస్యల పరిష్కారానికి తమ వంతు పూర్తిస్థాయిలో కృషి చేశామని టౌన్‌షిప్ అధ్యక్షుడు వంశీ అన్నారు. శనివారం టౌన్‌షిప్ సర్వసభ్య సమావేశం సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టౌన్‌షిప్‌లో విద్యుత్, మంచినీరు. రోడ్లు, డ్రైనేజీ, స్పీడ్ బ్రేకర్లు, పార్కుల అభివృద్ధి లాంటి ఎన్నో పనులను మున్సిపాలిటీ నుంచి చేయించామన్నారు. తమ రెండు సంవత్సరాల పదవీకాలంలో తగు మేర అన్ని రకాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం లెక్కలను ఆడిట్ రిపోర్టును సభ్యుల ముందు ఉంచి తీర్మానం చేశారు. అనంతరం ఈ నెల కొత్త కమిటీని ఎన్నుకునేందుకు ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఈ నెల 24వ తేదీన నామినేషన్ల దాఖలు, 25వ తేదీన ఉపసంహరణలు, 26వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించారు. రాబోయే రోజుల్లో అలకాపూర్ అభివృద్ధికి కృషి చేసే కొత్త కమిటీని ఎన్నుకోవాలని కోరారు. ప్రధాన కార్యదర్శి జయప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌దేవ్, శ్రీనివాస్, గిరిజ, కోశాధికారి శ్రీధర్, సభ్యులు శశి, ప్రవీణ, శేఖర్, ప్రదీప్, నాగార్జున, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ.. సైన్స్ పార్కు


చిన్నారుల కోసం ప్రత్యేకంగా..

మాదాపూర్: ఐటీ ప్రాంతంలో అద్భుతమైన థీమ్ పార్కు అందుబాటులోకి వచ్చింది. మాదాపూర్‌లోని పత్రికానగర్‌లో ఇంటరాక్టివ్ సైన్స్ పార్కును ఏర్పాటు చేశారు. ఎకరా స్థలంలో రూ.199.50 లక్షలతో ప్రత్యేక థీమ్‌తో ఏర్పాటు చేసిన పార్కు వాకర్స్‌ని, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. చుట్టూరా ఐటీ కంపెనీలు ఉండడంతో ఉద్యోగులు సమయం ఉన్నప్పుడల్లా సేద తీరుతూ, వాకింగ్ చేస్తు సరదాగా గడుపుతున్నారు .ప్రత్యేక డిజైన్‌లతో కుర్చీలు, బొమ్మలు, యోగా కేంద్రం , పచ్చదనంతో అలరారుతోంది.


### 40 సంవత్సరాల కేలండర్

పార్కులో ప్రత్యేకంగా 40 సంవత్సరాల కేలండర్‌ను ఏర్పాటు చేశారు. సంవత్సరం, నెల, రోజు, తేదీ తెలుసుకునే విధంగా ఏర్పాటు చేశారు. 2018–2057 వరకు కేలండర్‌ను చూడొచ్చు. ఇక సందర్శకుల కోసం ఆప్టికల్ ఇలుషన్స్ ప్లేట్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని తిప్పినప్పుడు ఒక్కొసారి ఒక్కో ఆకారం కనిపిస్తుంది. 2డీ ఆకారం త్రిడీ టూనల్‌గా కనిపిస్తుంది.


మాదాపూర్‌లోని పత్రికానగర్‌లో ఇంటరాక్టివ్ సైన్స్ పార్కు




2018-2057 కేలండర్



పార్కులో ఆకట్టుకుంటున్న విగ్రహాలు

### ఆధునికత ఉట్టిపడుతోంది



సంవత్సరం నుంచి వాకింగ్ చేస్తున్నాను. మినీ జిమ్ చాలా బాగుంది. ఐటీ ఉద్యోగులు ఎక్కువగా వస్తున్నారు. పార్కు ఆహ్లాదకరంగా ఉంది. ఆధునికత ఉట్టిపడుతోంది.

– అజయ్, ఐటీ ఉద్యోగి

### పార్కు చాలా బాగుంది



3 నెలలుగా వస్తున్నాను. పరిసర ప్రాంతాలలో ఎక్కడా పార్కు లేదు. ఐటీ కంపెనీల పక్కనే ఉండడంతో సమయం దొరికినప్పుడల్లా వచ్చి సేదతీరుతున్నాము. పార్కులో అన్ని వసతులు బాగున్నాయి.

– సతీష్, ఐటీ ఉద్యోగి




వివిధ ఆకృతులలో కుర్చీలు


మినీ జిమ్




యోగా వేదిక

## వ్యాయామంతో ఒత్తిడి దూరం


మాట్లాడుతున్న ప్రకృతి వనం వ్యవస్థాపకులు ప్రసాద్

గచ్చిబౌలి: నిత్యం వ్యాయామం ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని ప్రకృతి వనం వ్యవస్థాపకులు ప్రసాద్ సూచించారు. శనివారం మసీద్‌బండలోని హోలిస్టిక్ ఆస్పత్రిలో వరల్డ్ హెల్త్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటింట్లో తయారు చేసుకునే ఆహారపదార్థాల ద్వారా అనేక రోగాలను తగ్గించుకోవచ్చన్నారు. ప్రతి ఇక్కరు నిత్యం వ్యాయామం, నడక అలవర్చుకోవాలని సూచించారు. పలువురికి బీపీ, షుగర్, ఈసీజీ, యూరిక్ యాసిడ్, లిపిడ్ ప్రొఫైల్ ఉచిత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ బీఎస్ రామచంద్ర, సీఈఓ హనుమాన్ ప్రసాద్, మెడికల్ డైరెక్టర్ రామకృష్ణ, సీఓఓ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా మాధవరావు



గచ్చిబౌలి: బీసీ సంక్షేమ సంఘం శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా వల్లపు మాధవరావు నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా శనివారం నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ బీసీ సంక్షేమం కోసం నిరంతరం పాటుపడతామన్నారు. శేరిలింగంపల్లి మండలంలో బీసీలందరినీ సమన్వయపరిచి ఐక్యతకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రాంచందర్‌యాదవ్, సాయన్న, సందీప్‌కుమార్, గౌస్‌ఖాన్, ప్రసాద్, శ్రీనివాస్, ఏడుకొండలు,రవి, విజయ్‌కుమార్, రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలు.. అప్రమత్తంగా ఉండాలి

జిన్నారం (పటాన్‌చెరు): సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిన్నారం ఎస్‌ఐ నాగలక్ష్మి అన్నారు. శనివారం జిన్నారం గ్రామపంచాయతీ ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ..అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఆన్‌లైన్‌లో ఎటువంటి లావాదేవీలకు ఓటీపీ నంబర్లు, వ్యక్తిగత వివరాలు తెలుపవద్దన్నారు. కార్యక్రమంలో ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, జగన్ రెడ్డి, గ్రామస్తులు పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పోషకాహారంపై అవగాహన

ఫిలింనగర్: పోషణ పక్షోత్సవాల్లో భాగంగా షేక్‌పేట మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై శనివారం అవగాహన కల్పించారు. రోజూ ఓ కార్యక్రమంతో అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఆహార పదార్థాలు, చిరుధాన్యాలను ఉపయోగించి వంటకాల తయారీని చూపించారు. కార్యక్రమంలో షేక్‌పేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫాతిమా పాల్గొన్నారు.

## వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు

ఫిలింనగర్: చైత్ర పౌర్ణమి సందర్భంగా ఫిలింనగర్ దైవసన్నిధానంలో రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజు స్వామి వ్రతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ చైత్ర పౌర్ణమి నాడు వ్రతం ఆచరిస్తే మంచి జరుగుతుందనే నమ్మకంతో పెద్ద ఎత్తున భక్తులు వ్రతాలు ఆచరించారు.

# శిలా నిశ్శబ్దం..

మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శిలా నిశ్శబ్దం పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రకళాకారులు మాత్రమే నిశ్శబ్ద భాషను అర్థం చేసుకోగలరన్నారు. చిత్రాలు మన సంస్కృతిని తెలుపుతున్నాయన్నారు. ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లకు చెందిన కళాకారులు రామప్పకోట, వివిధ రకాల గుడులు, కాకతీయ సంపద తదితర అంశాలతో కూడిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. ఈనెల 14వ తేదీ వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సందర్శించవచ్చని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసఫ్‌జాహి రాజ వంశస్థుడు నిజాం రౌనక్‌యార్‌ఖాన్, కెవి.రమణమూర్తి, రాణక్‌యార్‌ఖాన్, అరవింద్ పకిడే, ఆర్య తదితరులు పాల్గొన్నారు.




# క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట


వాలీబాల్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులకు అండగా ఉంటుందని పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ పీజేఆర్ స్టేడియంలో ఫస్ట్ ఫెడరేషన్ కప్ ఛాంపియన్ షిప్ త్రీఏ సైడ్ వాలీబాల్ కప్ –2025ను శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 11 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారు. త్రీఏ సైడ్ వాలీబాల్ జనరల్ సెక్రటరీ మారుతి హజారీ, చైర్మన్ జీవన్ కిరణ్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, రఘునందన్ రెడ్డి, ధాత్రినాథ్‌గౌడ్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, రవీందర్ రెడ్డి, ప్రసాద్, సత్యారెడ్డి పాల్గొన్నారు.

# కనువిందు..

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరికి చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి రమ్యశ్రీనివాస్ భరతనాట్య ప్రదర్శనతో అలరించింది. ఇందులో బ్రోచే వారెవరురా కీర్తన, వర్ణం, తిల్లాన అంశాలను ప్రదర్శించారు. నాట్యధార స్కూల్ ఆఫ్ డ్యాన్స్ గురువు హారిణి శిష్యబృందం వరవీణా, ఆంగికం భువనం, పుష్పాంజలి, కేరళ నృత్యం, జతిస్వరం తదితర అంశాలను కళాకారులు అక్షర, ధ్రుతి, సంవేద్య, ఆద్య, శాన్వి, సరయు, శ్రీపేక్ష, శ్రీనిక, ఆరుషి, ఆరాధ్య, వైష్ణవి, ప్రగతి తదితరులు దర్శించారు.

**అన్నమయ్యపురంలో..**

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం కథక్ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. డాక్టర్ దివ్యసల్లా సింగ్ , లక్ష్మి విశ్వనాథన్ శిష్యబృందం సుమన్‌గిద్వాని, మాన్సిహిందోచ, వందనత్రయి, శివస్తుతి, మధురాష్టకం, దర్బారి తారానా, నటభైరవ తారానా కీర్తనలకు కథక్ నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. అనంతరం డాక్టర్ శోభరాజు, నందకుమార్‌లు కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.





గోపీనగర్‌లో విజయయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్ ,నాయకులు


జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్‌చాలీసా పారాయణం

# ఘనంగా హనుమాన్ జయంతి


శివసాయిక్షేత్రంలో ఆంజనేయస్వామి

శేరిలింగంపల్లిజోన్ బృందం: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో ఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు, వడమాల, ఆకుపూజ చేశారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా మారింది. అలాగే గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రం, జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని ఆలయంలో హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ,బస్తీవాసులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం వేళ పల్లకిసేవ, హనుమాన్ విజయయాత్రను వైభవంగా నిర్వహించారు.


నల్లగండ్లలో విజయయాత్ర